# పాములాంటి బ్రతుకు

చైత్రం వచ్చి రాకముందే వాతావరణం రంగులు మార్చుకొంది. బూడిదరంగు ఆకాశపు ఆశ్లేషంలో కళావిహీనం మౌతున్నది పుడమిపడతి. అత్యావసరమైన పని ఉంటేనే కాని వీధిలోకి అడుగు పెట్టడం లేదెవ్వరూనూ. సర్వేసర్వత్రా శ్మశానప్రశాంతత. మారుమూలల సందులూ గొందులూ నిర్జనాలై, నిర్జీవాలౌతున్నవి. రోడ్లప్రక్క పెరిగి పూచిన వేపచెట్ల నీడలలోనూ, చల్లదనం చేతులు చాపుకున్న ఆయతనాల ప్రాంగణాల్లోనూ అస్థిపంజరాల కదలికలు. కూడు లేకున్నామాన, గొంతు తడుపుకోడానికి గ్రుక్కెడు నీళ్ళు కావాలన్న జీవనతాపత్రయం. అందుకనే నీళ్ళురాని మ్యునిసిపాలిటీవారి కుళాయిల దగ్గర ఆశలతో, అవమానాలతో అర్ధరాత్రి మిట్ట మధ్యాహ్నాల భేదం తెలీని మంగళగిరి చేంతాడులలాంటి క్యూలు. గుక్కెడు నీళ్ళు

చాలు; పోయే ప్రాణాలు నిలబడతాయి. వాటికోసం కష్టమెంతటిదైనా... సహించాలి. తప్పదు మరి!

ఆ మధ్యాహ్నం, నీళ్ళకోసం పడిగాపులు పడి పడి తిరుగు ముఖం పట్టిన ఓ అయినయింటి వారబ్బాయి, పట్టి బిందెతో ఉసూరుమంటూనే, తెలిసిన మొగం కనబడగానే ఆ విషయం దాచుకోలేక లేని ఓపిక తెచ్చుకుంటూ, బిగ్గరగా చెప్పేశాడు. "బాబాయ్! పేరిశాస్త్రుల్లు చచ్చిపోయేడు, నీకు తెలిసిందా?"

పేరిశాస్త్రుల్లు పేరు తెలియని వాళ్ళు ఆ పేటలో ఎవరూ లేరు. పోయిన ఉగాదికే యాభై పూర్తి చేసుకున్నాడు. కొంచెం స్థూలం. తలమీద ముందంతా డొక్కం చేసి, వెనక గోష్పాదమంత జుట్టు పెంచుకున్నాడు. ఫాలం మీద అడ్డంగా విభూతి రేకలు. మధ్యగా పిల్లి కన్నంత గంధంబొట్టు. చొక్కా లేకపోవడం మూలాన, నల్లగావున్న జందెమూ, అందంగా కన్పించే చిరుబొజ్జా, విశాలమైన వక్షమూ స్ఫుటంగా కన్పించేవి. ధోవతి మోకాళ్ళపైకే కట్టేవాడు. అయినా నీళ్ళబిందెలు మోసినప్పుడల్లా ఆ నీళ్ళు ధోవతిమీద బడి, మళ్ళీ అవే గాలికీ ఎండకూ ఆరడంచేత, ఆ ముతకధోవతి మరింత మొద్దుబారి, శాస్త్రుల్లు అడుగు ముందుకు వేసినప్పుడల్లా అదోవిధమైన వింత శబ్దం చేసేది. అతనికున్న ఆస్తల్లా తళతళ మెరిసే రెండు ఇత్తడి నీళ్ళ బిందెలు మాత్రమే. ఇరవై ఏళ్ళు కూడా రాకుండా పెళ్ళి చేసుకున్నాడేమో, సంతానభాగ్యం మాత్రం ఓ అరడజను మంది ఆడపిల్లలకూ, ఓ ఇద్దరు మగపిల్లలకూ పెరిగింది.

భార్య అలివేణి, అసలే అర్భనాకారపుదీ, అందునా పిల్లల కోడి కావడంతో మెద మెద లాడుతూ ముప్ఫయి ఏళ్ళకే ముసలిదానిలా కన్పించేది. మోయలేని భారాన్ని మోయవలసి వచ్చిన పేరిశాస్త్రుల్లు విధీ, సంఘమూ పగబట్టి తన మీద పెట్టిన బాధ్యతలను కొంతవరకైనా సంతృప్తిగా నిర్వహించడం కోసమని, ప్రొద్దున్నే లేచి, తలారా పంపు దగ్గరే చన్నీళ్ళ స్నానం చేసి, కావలసినవారికి కావలసినన్ని నీళ్ళ బిందెలు ఆ తడిబట్టలతోనే చేరమోసేవాడు.

అల్లంతదూరంలో అతగాణ్ణి చూడగానే సౌఖ్యాల దొంతరలో చుట్టుకుపోయిన కొత్త దంపతులూ, క్రొత్తగా ఆ వూరికి బదిలీ అయి వచ్చిన ఉద్యోగులూ, కౌమారం దాటి వార్ధక్యంలోకి అడుగుపెడుతున్న వాళ్ళూ, కొండంత భారాన్ని తప్పించుకున్నామన్న సంతోషంతోనో, 'ఫర్వాలేదు, మన అంతస్తుకూ, గౌరవానికీ ఇహ ప్రమాదంలేదు' అన్న ధీమాతోనో, 'శాస్త్రుల్లూ! మాకూ ఓ బిందెడు నీళ్ళు పోసిపో, మరిచిపోయేవు' అనో, 'పేరిశాస్త్రుల్లూ! అందరి మీదా ఓ అర్ధణా డబ్బులు ఎక్కువే ఇస్తాంగాని, మంచి నీళ్ళుమాత్రం కొంచెం తొందరగా తెచ్చిపెట్టు—పెద్ద బిందెతో!' అనో, అనేవాళ్ళు.

పేరిశాస్త్రులు ఎవ్వరినీ కాదనలేదు. వూపిరున్నంత వరకూ ఇతరుల పనులు చేసిపెట్టి, తన పనులు చేసుకొనే వాడు నిజానికి ఈ విధంగా అణాలూ బేడలూ ప్రోగుచేసు

కోవడం ఈ జీవన తాపత్రయసముద్రాన్ని ఆశల చెంబులతో కొలవడమే—పదునులేని సూదితో పదినిలువల బావిని తవ్వినట్టు కాసీ, ఇంతకన్నా మరేం చేయడం? నిజానికి అతని సంపాదన మీాదే ఆధారపడి ఉన్నట్లయితే, ఆ కుటుంబం ఎప్పుడో అణగారి వుండేది. అలివేణికూడా అన్నీ తెలిసిన ఇల్లాలు కావడంతో కలెక్టరుగారికి మినపసున్ని విసిరిపెట్టి పోలీసాఫీసు వెంకటరత్నం గారికి ఇడ్లీలకు మినప్పప్పు రుబ్బిపెట్టీ, ఒకరికి అప్పడాలనో, మరొకరికి వడియాలనో, వేరొకరికి ఆవకాయ కారమనో, నాలుగోవారి ఇంట్లో 'అల్లుడు కార్యం చేసుకోడానికి వచ్చాడు. వంటచేసి పెట్టి వుళ్ళ' మని పురమాయింపు వస్తే ఆపని చేసిపెట్టో, ఏదోవిధంగా నాలుగు డబ్బులు సాయంత్రానికల్లా సంపాయించుకుని వచ్చేది. ఆడంబరం లేకుండా అలివేణి చేస్తున్న పనులు పేన్నిళ్ళకు చన్నీళ్ళగా ఉండడంతో, పేరిశాస్త్రులకు మధ్య మధ్యలో ఏనుగు నెక్కినంత సంబరం కలిగేది.

అటువంటిది, ఈ మధ్యాహ్నం, సాగుతున్న యాత్ర కాస్తా ఆగిపోయి నట్లయింది. అలివేణికి బ్రతుకుపాము తనను కబళించినట్లయింది. తీరా విచారించి చూస్తే పేరిశాస్త్రులు మరణం చాలా తమాషాగా సంభవించింది. నీళ్ళ బిందెలు మోసుకుని వస్తూనే ఉన్నాడట. పేరిశాస్త్రులతో పాటే నిద్రలేచిన సూరీడు నడినెత్తి దాకా ప్రయాణం చేయడం, అక్కడ అలసిపోయి కొంచెంసేపు సేదతీర్చుకోడంకోసం ఆగడమూ జరిగాయి. ఈదురుగాలి ఆ చెవినుంచి ఈ చెవికివీస్తున్నది. సర్వప్రపంచమూ నీటికోసం అంగలారుస్తున్నది.

శాస్త్రిలకు దాహమయింది. ఎదురుగా నీళ్ళబిందె; తాగాలన్న బలమైన కోర్కె. 'అమ్మో! ఇంకేమైనా ఉందా?—కలెక్టరుగారి పెళ్ళాం అసలే కర్కోటకురాలు. గ్లాసెడు నీళ్లు తక్కువైనా గయ్యాళిలా ప్రవర్తిస్తుంది' ఒకటి రెండుసార్లు బిందె ఆ బుజంనుంచి ఈ బుజానికి మార్చుకున్నాడు పేరిశాస్త్రిల్లు సగందూరం వరకూ వచ్చి అక్కడ నిలబడ్డాడు కాస్సేపు. ఆ తర్వాత బిందె వంచుకుని గబగబా కడుపుపట్టినన్ని తాగాడు. అంతే! ఆ తర్వాత పది అడుగులు కూడా వేయలేదు. పాములాంటి బ్రతుకు వేసిన కాటు బలమై అతన్ని అశక్తుణ్ణి చేసింది. చూసిన వాళ్ళు 'గుండె ఆగిపోయి చనిపోయా'డని నిర్ధారణ చేశారు.

ఎవరనుకున్నారూ పేరిశాస్త్రిల్లు అలా చనిపోతాడని? నడుస్తూ నడుస్తూ ఉన్న మనిషి, మాట్లాడుతూ మాట్లాడుతూ ఉన్న మనిషి, బరువు మోస్తూ మోస్తూ ఉన్న మనిషి నడవకుండా, నెత్తిమీద ఉన్నబరువును క్రింద పడేయడం ఎంత చిత్రమైన చిత్రం!! ఏమైతే ఏం, మనిషి పిడిరాయిలా ఉన్నా, అతనూ చచ్చిపోతాడు, ఎవరికీ చెప్పకుండా పెట్టకుండా!!

అలివేణి గంపెడు చీకటిని నెత్తిన వేసుకోవలసి వచ్చింది. పేరిశాస్త్రిలు వదిలపోయిన ఆ స్తల్లా తళతళ మెరిసే రెండు ఇత్తడి నీళ్ళబిందెలు!! ఏం చేస్తుంది అలివేణి? ఆలోచించి ఆలోచించి, మనసు పాడుచేసుకోవడమే కాని ఏ నిర్ణయానికీ రాలేకపోయింది. ముప్పొద్దులు, ఊం

సేపు అన్నానికి ఆలస్యమయితే ఓర్చుకోలేని ఎనిమిదిమంది అర్భకులను ఎట్లా పోషించడం? ఆమె కళ్ళముందు నీటిప్రవాహాలు ప్రవహించాయి ప్రవహిస్తున్న నదులు కాస్తా ఎండిపోతున్నాయి. నీళ్ళలో సూర్యకిరణాలు ప్రతిఫలించి తళతళ మెరవడం, ఆమెకు రక్తార్ణవంగా కన్పిస్తున్నది ఆ తళతళలు ఆమె భరించలేదు. నిమ్మకు నీరెత్తినట్లున్న జీవితం ఆమెకు కావాలి. దాన్ని ఎల్లాగైనా సంపాయించుకోవాలి.

* * *

ఏ పంచన యముని మహిషపు లోహపు ఘంటలు ఘణేల్ మంటాయో అక్కడ ఆకలిప్రసక్తి ఉండదు. ఎవరూ వంట సంగతి పట్టించుకోరు. ఒకరోజో, రెండురోజులో కన్నీరు కాల్వలు కట్టడం, జ్ఞాపకాల ఈదురుగాలి మనసులను మభ్యపెట్టడం, అంతా విషాద వాతావరణం. కానీ ఆ తర్వాత... కడుపులో పేగులు కొంచెం ముడుతలు సడలడంతో, నరాలు జివ్వుమంటూ దిమ్మెరబోవడంతో ఎవరో ఒకరు ఇంట్లో ఏ చీకటిమూలనుంచో అంటారు—"చాల్లెండర్రా! పోయిన వాడెట్లాగూ అదృష్టవంతుడే! ఉన్నవాళ్ళం మనమే దరిద్రులం. ఎంతేడిస్తే మాత్రం వాడేమన్నా తిరిగొస్తాడా, పెడతాడా?—మన సంగతి మనం చూసుకోడం తప్ప చేయగలిగిందేమున్నదీ ఇప్పుడు?—లేచి, భోజనాల సంగతేదో చూడండి, పిల్లలు ఆకలితో నకనకలాడుతున్నారు."

ఈ మాటలతో మళ్ళీ ఆ ఇంట్లో జీవన తాపత్రయం ప్రారంభమవుతుంది. జీవితసర్వం పడగ విప్పుతుంది.

అలివేణి మనలోకంలో లేకుండా పడి ఉండడం చూచి, ఆ వీధిలో వాళ్ళందరూ ఎంతో దుఃఖించారు. ఆ వీధి చివర ఉన్న క్రొత్తగా కట్టించిన మూడంతస్థుల ఎర్రరంగు మేడ అధిపతి, పబ్లిక్ ప్రాసిక్యూటరుగా వెలబిగిని మూడు సార్లు మంత్రిగారి చలువచేత రాజ్యమేలి పదవీ విరమణం చేసిన లక్ష్మణ్ణ, ఆ బీదకుటుంబాన్ని చూచి మరీ జాలిపడ్డాడు. భోజనం చేస్తున్న వాడల్లా అలివేణీ, ఆమె రూపమూ జ్ఞాపకం రావడంతో మధ్యలో ఆగి, భార్యతో "చూడూ! ఏదో ఇంత ఇచ్చాడు భగవంతుడు మనకు. అలో లక్ష్మణా అంటూ అఘోరిస్తున్నారు ఆ పసికందులు. ఆ తల్లి అలివేణి తన దుఃఖంలో తాను వుండి వాళ్ళకు ఏం వండిపెట్టిందో ఏమో? ఈ పూటకు, మనం తినగా మిగిలిందే—వాళ్ళకు పంపించరాదూ?" అన్నాడు.

ప్రాసిక్యూటరుగారి భార్య ఏమీ జవాబు చెప్పలేదు. అసలే పెద్దవైన తన కళ్ళను మరింత పెద్దవి చేస్తూ తనభర్త వేపు చూసింది. ఎవరో పార్టీలు పంపిన నూజివీడు పెద్దరసాలను రుచిచూస్తూ ఆయన భార్యను గమనించలేదు.

ప్రాసిక్యూటరుగారి పనిమనిషి ఓ పెద్ద పళ్ళెం నిండుగా ఏవేవో పెట్టుకుని, పైన మల్లెపువ్వులాంటి ఓ గుడ్డ మూతపెట్టి తమ దగ్గరకు రావడంచూచి అలివేణి ఆశ్చర్యపోయింది. పళ్ళెంలో ఉన్నవేమిటో చూచిన తర్వాత ఆమె

ఏది కలో నిజమో అర్థం కాలేదు. రెండు మూడు కూరలు, నాల్గయిదు తీపి వంటలు, అయిదారు పచ్చళ్ళు, గుండ్ర సంబావుల అన్నం, తోడుపెట్టిన పెరుగు, అరపరకపైగా మామిడిపళ్ళు... ఇవన్నీ తినడానికేనా? ఆమెకు సందేహం కలిగింది

నిజానికి అంతకు క్రితంవరకూ ఆ కుటుంబంలోని వారికెవరికీ ఆహారం మీదకు మనసుపోలేదు కానీ ఆ పదార్థాలను చూచిన తర్వాత? — నిశ్శబ్దంగా పిల్లలూ పిల్లల తల్లి అలివేణి విస్తళ్ళు వేసుకున్నారు. మనసులో ఉన్న అనుమానమో, బాధో ఏమో తొలగిపోయినట్లనిపిస్తున్నది వారికందరికి. అంతవరకూ జన్మలో అటువంటి భోజనం రుచి చూచి ఉండక పోవడమే దానికి కారణమేమో! బాధ వాళ్ళ భావనకు సానపెట్టింది పదార్థాలుమాత్రం, మహారుచిగా ఉన్నాయి. ఒకసారి తిన్నవాళ్ళు కూడా రెండోసారి మళ్లీ విస్తళ్ళ దగ్గరకుచేరి ఏమీ మిగల్చకుండా, పూర్తిచేశారు, అంతటి దుఃఖంలోనూ.

పేరిశాస్త్రులు పోయిన రెండో రోజునకూడా అలివేణికి బాగానే జరిగింది. కాలేజీలో లెక్కల ఉపన్యాసకుడుగా ఉన్న లక్ష్మీనారాయణగారి సతీమణి శ్రీలక్ష్మి, పేరిశాస్త్రుల్లు మీదఉన్న అభిమానం కొద్దీ, ఆ రోజున వాళ్ళింట్లో చేసుకున్నవేవో తానే స్వయానా తీసుకువెళ్ళి అలివేణికందించింది.

అట్లాగే మరో పుణ్యాత్ముడూ, మరో పుణ్యాత్ము రాలూ మూడోరోజునా, నాలుగోరోజునా కూడా ఆ కుటుం బాన్ని ఆదుకున్నారు. కానీ వాళ్ళ పిండివంటలేవీ, ప్రాసి క్యూటరుగారి ఫలహారాలంత రుచికరంగా లేవు.

అయినా మూడు నాలుగు రోజుల పాటు అలా అయాచితంగా లభించిన ఆహారం మాత్రం అన్నివిధాలా, అలివేణి తాను వండుకునే వంటకాలకన్నా బాగానేఉన్నట్లు గ్రహించింది. అవైనా మధ్యలో అకస్మాత్తుగా ఆగిపోకుండా నెలల తరబడి కనక సరఫరా అయినట్లయితే, అలివేణి తన కష్టాన్ని ఎలాగో దిగమింగుకొనేది

కానీ, కుటుంబాలకు కుటుంబాలనే పోషించగల తాహత్తు ఎవరికుంటుందీ?

అయిదోనాటి మధ్యాహ్నం, అలివేణీ, పిల్లలూ అజ్ఞాతబంధువు పంపించే అన్నప్పళ్ళాలకోసం ఎదురుచూస్తూ కూచున్నారు వీధిగుమ్మం దగ్గర చప్పుడైతే చాలు అందరి కళ్ళూ, పిల్లల కళ్ళూ అటువేపుకే పరుగెత్తేవి. మల్లెపువ్వు ల్లాంటి తెల్లగుడ్డ క్రింద దాచబడిన మధురమైన ఆహారం తమకోసం ఏక్షణాన అయినా రావచ్చునని వారి నిరీక్షణ. ఊహూ ఎవరూ ఆ యింటి ఛాయలకు రావడం లేదు. ఎవరి పనిలో వారికి క్షణం తీరికలేకుండా ఉంది. పైనతిరిగే పక్షులు కూడా ఓపిక తగ్గి గూళ్ళకు చేరుకుంటున్నాయి.

సాయంత్రందాకా చూసిచూసి, ఇహ అలివేణి

పిల్లలకింత వండి పెడదామని లేచింది. గతకాలపు భయంకర మైన జీవితం తప్పినట్లనిపించింది ఆమెకు. అవును, పాము కాటులాంటి గతం... ఎట్లా మరిచిపోవడం?... మూడు నాలుగురోజులపాటు ఇంట్లోవున్న వాటితోనే ఎలాగో సర్దు కుంది ఆ కుటుంబం. గడిచిన నాలుగు రోజులుగా స్వేచ్ఛ మైన నెయ్యికి అలవాటుపడ్డ జిహ్వ, అది కన్పించక పోవ డంతో తిరుగుబాటు చేసింది. గడ్డ పెరుగులో మామిడికాయ లను నంజుకున్న నాలుక అవి లేకపోవడంతో సత్యాగ్రహం సాగించింది. గొంతువరకూ ఆహారాన్ని పొందడానికి అల వాటు పడ్డ అన్నవాహిక, అది కరువు కావడంతో కటకట పడింది. ఇంట్లో పొయ్యికూడికీ, పొయ్యి క్రిందికీ కూడా కరువయ్యాయి. బయట ఎండలు నిప్పులు చెరుగుతున్నాయి.

అలివేణి ఇంట్లో మూలమూలలా గాలించింది. రెండు రోజులక్రిందట పోలీసు వెంకటరత్నంగారు పంపించినవాటిలో వాడగా మిగిలిన రెండు నిమ్మకాయలు అంట్లు కడిగే తూము దగ్గర కన్పించాయి. ఆ పూటకు వాటినే కడిగి, రసం పిండ డానికి వీలుకాకపోగా, రోటిలో త్రొక్కి, ఆ పిప్పిని నీళ్ళలో కలిపి తలో గ్లాసు షర్బత్తని తాగించింది.

మర్నాడు అవీ కరువయ్యాయి. ఇల్లంతా బోసి పోతూ కన్పించింది పేదరికం పీఠం వేసుకున్న బైరాగుల మఠంలా కనిపించింది. పేరిశాస్త్రిలు చనిపోయిన తర్వాత ఆ రోజు మొట్ట మొదటిసారిగా వాళ్ళు పస్తు పడుకోవలసి వచ్చింది.

పెద్దమ్మ ప్రవేశించకూడదే కాని, ప్రవేశించిన తర్వాత ఆమె స్వైరిణి. ప్రొద్దు పడమరకు వాలుతూంది. జీవన శరీరం లోభ విషకలుషిత మవుతున్నది.

పాలుత్రాగే పసివాడు ఎండిపోయిన అలివేణి రొమ్ములమీదనే శోష తెప్పాడు. ఎడపిల్లవాడు "అమ్మా! ఏవిటోగా వుందే నాకు కడుపులో" అంటూ ఏడ్వడం ప్రారంభించాడు. అలివేణి సమాధానం చెప్పలేకపోతున్నది. అయినా సమాధానం చెప్పాలి: "ఊరుకోండి బాబులూ! ఊరుకోండి" అలివేణి గొంతు గాద్గద్యం వహించింది.

పిల్లలందరూ నిలబడలేకపోతున్నారు. బొక్కబోర్లా పడుకుంటే సుఖంగా ఉండనిపిస్తున్నది వాళ్ళకు. కళ్ళ ముందు ఏవేవో బొమ్మలు కదిలిపోతున్నాయి. పచ్చని, ఎర్రని జ్వాలలేవో పొడుగు సాగుతున్నాయి. చెవుల్లోనుంచి గింగురుమంటూ అర్థంలేని శబ్దాలు వినబడుతున్నాయి. గొంతులు మెత్తబడుతున్నట్లుగా అనుమానమూ, అనుభవమూ కలుగుతున్నది ఆ పిల్లలకు.

అలివేణి కూర్చునే పగటి కలలు కంటున్నది. 'ఏ ఇంట్లో నన్నా తనను వంటకు పిలవవచ్చు. ఎవరికన్నా పిండి రుబ్బి పెట్టవలసిన అవసరం రావచ్చు. ఎక్కడైనా కార్యమో, కరామతో అయితే తనకు పిలుపు రావచ్చు.'

పిచ్చి అలివేణి! ప్రజల మనస్సు తెలుసుకోకుండా ఊహాల మేడలు కడుతున్నది. అవసరం ఉన్నప్పటికీ, ఇప్పుడు వాళ్ళు అలివేణిని పిలవ దలుచుకోలేదని ఆవిడకు ఎట్లా తెలుస్తుందీ?

పొరుగింటి పుల్లమ్మ, ఇరుగింటి ఎల్లమ్మతో ప్రస్తావించినవిషయం ఆవిడదాకా రానేలేదు. "అదికాదే ఎల్లమ్మా! నాకూ, చెప్పొద్దూ అలివేణినిచూస్తే గుండెంతా నీరయిపోతున్నది. అయినా ఏం లాభం చెప్పు? మొగుడుపోయి అది అఘోరిస్తుంటే, ఇప్పుడు దాన్ని మనం పన్లకు పిలుస్తే ఏమన్నా బావుంటుందీ...... తెలిసిన నీలాంటి వాళ్ళందరూ గడ్డి పెట్టరటే?" అన్నది పుల్లమ్మ.

ఇరుగింటి ఎల్లమ్మ "కాదూ మరి?" అంటూ సాగదీసుకుంది.

చీకటిని ఫలహారంచేసి మామూలుగా మర్నాడు ఉదయం సూరీడు పనిలోకి వచ్చాడు అతనికీ బీదవాళ్ళంటే కోపంలా ఉంది; అలివేణి ఇంట్లోకి మాత్రం తొంగిచూడ లేదు.

మూడోపిల్ల చాకలెల్లను గురించి కలలు గంటున్నది. నాలుగోది ఆకలి దేవతకు ఏడుపు రాగంలో అర్చన సాగిస్తున్నది.

అలివేణికి అంతా అయోమయంగా వుంది. పెద్దగా ఏడ్చినా గుండె కొంత తేలికపడును. పిల్లలకోసమని లేని నిగ్రహాన్ని తెచ్చుకుంటున్నది.

పొరుగింట్లో ఎక్కడో తలుపు చప్పుడయింది. కాఫీ పొడి వేయిస్తున్న వాసన వస్తున్నది అదిగో, ఈల వినిపిస్తున్నది, రాధాయి స్కూలుకు పోతున్నాడులా ఉంది. ఖంగు ఖంగుమంటూ ఎవరో దగ్గుతున్నారు. అవును! పోలయ్య తాత! జ్యూట్ మిల్లు పనిలోనుంచి తీసేసినప్పటినుంచీ ఇట్లాగే దగ్గుకొంటూ వీధులన్నీ తిరుగుతు టాడు. ఎవరివో గాజుల చప్పుళ్ళు—సన్నగా! మల్లెపూల వాసన—మత్తుగా! కొట్టు తెరవడానికని రామారావుగారు తొందరగా నడుస్తున్నారు. ఏదో కూనిరాగం!! గుమాస్తాలు, వర్తకులు మోసగాళ్ళు, యవ్వనం, వార్ధక్యం—ఆ వీధి ఓ క్రొత్త రూపం దాల్చింది. కాన్వెంటుకు పోతున్న అమ్మాయిల వెనక పదిమంది కుర్ర వాళ్ళు—వాళ్ళకు పెళ్ళిళ్ళు కావా? వాళ్ళకు అల్లంత దూరంలో ఇడ్లీ లమ్ముకునే నాగరత్నం, పళ్ళెం నిండుగా ఇడ్లీలు పేర్చుకుని- మరో చేతిలో ఛట్నీపాత్ర పుచ్చుకొని, "ఇడ్లీ! ఇడ్లీ! అణాకు రెండిడ్లీ! వేడివేడి ఇడ్లీ!" అంటూ కేకలు వేసుకుంటూ వస్తున్నది.

నిజానికి ఆ కేక ముందుగా వినిపించింది పెద్దవాడికి. విని, చిన్నవాడికేసి చూశాడు. చిన్నవాడూ విన్నాడు. విని పెద్దవాడివైపు చూశాడు. వాళ్ళిద్దరి కళ్లూ కలుసుకున్నాయి. చిన్నవాడు గొణిగాడు. "ఇడ్లీ!"

నాగరత్నం దగ్గరకు వస్తున్నట్లుగా తెలుస్తూనేవుంది. అలివేణి లేచి భుజం మీదుగా కొంగుకప్పుకొని వీధిగుమ్మం దాకా వచ్చింది. అప్పయినా అడిగి పిల్లలందరికీ తలో రెండిడ్లీ తీసుకోవాలని ఆమె ఉద్దేశ్యం. తన చేతిలోకి డబ్బురాగానే నాగరత్నానికి ఇచ్చివేయ వచ్చును. ఈమాత్రానికి ఒప్పుకోదేమిటి?

నాగరత్నం దగ్గరకు, మరీ దగ్గరకు వస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తూనే వుంది. ఆవిడ తన గుండెలమీదుగా నడుస్తున్నట్లుగా భావించుకొంటున్నది అలివేణి ఇడ్లీలపళ్ళెం దగ్గరకు వస్తున్నది. వాటిమీద గుడ్డ కప్పబడివుంది. ఒక్కసారి, ఒక్కసారి కనిపిస్తేనన్నా బావుణ్ణు అవ్వి.

నాగరత్నం, అలివేణి ఇంటిదాకా వచ్చి అక్కడ గుమ్మం దగ్గర నిలబడ్డ అస్థిపంజరాన్ని, ఆకలి మృగాన్ని చూచింది అలివేణి కళ్ళు కోర్కెతో మండుతున్నాయి. అలివేణి హృదయం బాధతో ఆక్రోశిస్తున్నది. ఆమె ఏదో అడగబోయింది; అడగాలని అనుకున్నంతసేపు పట్టలేదు. నాగరత్నం జీవితతత్వం తెలుసుకున్న దానిలా, అక్కడి నుంచి త్వరత్వరగా అడుగులు వేసుకుంటూ ముందుకు వెళ్ళిపోయింది.

తలుపులు విసురుగా వేసి, దిగులుగా లోపలకు వచ్చింది అలివేణి. ఆశతో, బాధతోవున్న పిల్లల కళ్ళల్లోకి సూటిగా చూడలేకపోయింది. తన చేతులు... వట్టిచేతులు...

వాడిన తోటకూర కాడల్లాంటి చేతులు—ఎక్కడ దాచుకోవాలో ఆమెకు తెలీలేదు. తన రిక్తహస్తాలను చూచి తనను తాను తిట్టుకుంది. పిల్లలేమీ మాట్లాడలేదు. పిల్లలందరూ నీడల్లా నిశ్చేతనులై పడివున్నారు. కొంతసేపటికి ఒకరివేపు ఒకరు ఎక్సరే కళ్ళతో చూసుకోవడం మొదలెట్టారు. అలివేణి ఒక మూలగా ముడుచుకుని పడుకొంది. ఎవరూ అక్కడ ట్లాడడం లేదు. అలా గంట గడిచింది. భయంకరమైన నిశ్శబ్దం. ఒకరి నిట్టూర్పు, హృదయచలనం, గుండె లోతుల్లోని మూగభాష మరొకరికి తెలుస్తున్నది. చివరకు ఎడపిల్లే నిశ్శబ్దాన్ని భంగపరచింది.

"అమ్మా! అమ్మా!"

"ఏమిటి తల్లీ!"

"ఏమిటోగా ఉందే కడుపులో! ఈ బాధ నే భరించలేనే!"

"లేదులే తల్లీ! నా తల్లివి గదూ! మంచి అమ్మాయివి..."

"ఇదిగో! ఇక్కడే! కడుపులో—నొప్పిగావుందే!"

"అది ఆకలి నొప్పి తల్లీ! చూడు! నేనుమాత్రం బాధ బాధపడటం లేదూ? అదే తగ్గిపోతుందమ్మా! గాభరా పడకు."

"అమ్మా! అమ్మా! నే చచ్చిపోతున్నానే!"

పెద్దపిల్ల మెల్లగా కళ్ళు తెరిచి చిన్నదానికేసి చూసింది. మగపిల్లలిద్దరూ ఏమీ మాట్లాడకుండా చెల్లెలి వైపు చూస్తున్నారు. వాళ్ళ కళ్ళలో నీలిమ వ్యాపిస్తున్నది. వాళ్ళ పెదిమలు ఎండిపోయి, పగిలిపోయినాయి. వాళ్ళ చెంపలు పాలిపోయాయి. వాళ్ళ శరీరాలు, రక్తం తెల్లబడ్డాయి అలివేణి ఈ మరణవేదనను చూడలేక పోతున్నది. బలవంతాన లేచి నిలుచుని, పెద్ద కుర్రాణ్ణి తనతో రమ్మన్నది. ఇద్దరూ పసిపిల్లలకు దూరంగా పోయి నిలబడ్డారు.

అలివేణి రహస్యం చెబుతున్నట్లుగా అన్నది: "ఒరేయ్! గురవయ్‌కొట్టు దగ్గరకు వెళ్ళి, ఎట్లాగైనా సరే, నాలుగైదు రోజుల్లో డబ్బిచ్చేస్తామని చెప్పి, ఇంట్లో కావల సినవేవో కొద్ది కొద్దిగానన్నా తీసుకు రావాలి. ఏం?— నా తండ్రివి కదూ!"

బయట ఎండకు బండలు బ్రద్దలౌతున్నాయి. ఆకుర్ర వాడికి కాళ్ళకు చెప్పులైనా లేవు; ఆ కాళ్ళలో బలం లేదు. నడిచేటప్పుడు రోడ్డుమీద ఆ చెట్టూ ఆ చెట్టూ ఆసరాగా చూచుకోవలసి వచ్చింది. చివరకు ఎట్లాగో గురవయ్ కొట్టు చేరాడు.

"కొత్త కుండలో నీళ్ళు, పోసీ సోడా తెప్పించమంటారా?" నడియెండలో తన దగ్గరకు వచ్చిన పెద్దమను

షులను అతినమ్రతగా తన బుట్టలో వేసుకుంటున్నాడు గురవయ్యసెట్టి అలివేణి కొడుకు, నీళ్ళ కుండవేపుచూసి,నాలికతో పెదిమలు తడి చేసుకున్నాడు.

కొట్టు దగ్గరకు వచ్చిన డబ్బుకలవాళ్ళు వెళ్ళిపోవడానికి చాలాసేపు పట్టింది. అంతసేపూ ఎండలోనే నిలబడ్డాడు కుర్రవాడు. అందరూ వెళ్ళినపోయినతర్వాత అతను కొట్లోకి వచ్చాడు.

"నాల్గుశేర్ల బియ్యం, శేరు కందిపప్పు, డాల్డా డబ్బా ఒకటి, మినపప్పు, పెసరపప్పు, మిరపకాయులు, బెల్లం, చింతపండు"—అన్నీ కట్టమన్నాడు.

గురవయ్యసెట్టి ఆ కుర్రాడివేపు పులుకూ పులుకూ చూశాడు. "ఊఁ డబ్బేదీ బుల్లోడా?" అన్నాడు బొంగురుగా.

ఆ మాట విని అలివేణి పెద్దకొడుకు బిత్తరపోలేదు. జేబులో చేతులు పెట్టాడు. ఆశ్చర్య పోయినాడు. లాగు జేబులు వెతికాడు మళ్ళీ చొక్కా జేబులు గాలించాడు. చివరకు అన్నాడు: "అయ్యయ్యో! డబ్బు కాస్తా ఇంట్లో మరిచిపోయివచ్చానండి—తొందరగా రావడంలో. సరే ఏంచేస్తాం మరి! ఈ ఎండలో మళ్ళీ అంతదూరం పోయి రావడం అంటే మాటలు కాదుగదా! సరుకులు కట్టండి: సాయంత్రం ఇచ్చేస్తాను డబ్బు."

సెట్టిగారు పుసుక్కున నవ్వాడు.

"మంచోడివే బుల్లోడా! అరువుబేరం మాకాడ లేదు. డబ్బట్టుకు సాయంకాలమే రా, సరుకులు కట్టించుతా" అన్నాడు.

ఆ కుర్రవాడు మరో మాట మాట్లాడలేదు. "సరే! అట్లాగేలే" అన్నాడు గంభీరంగా. త్వరత్వరగా బయటకు వెళ్ళిపోయినాడు.

పోతున్న ఆ కుర్రవాడి వేపుచూస్తూ, గురవయ్య సెట్టి, గురవమ్మతో అన్నాడు: "చూడేశ్! ఒంట్లో ఎముకలు కూడా లేవు బుల్లోడికి. ఇంకా డబ్బేం ఇత్తాడే?"

"పాపం!" అంది గురవమ్మ.

ఇంటికి ఉత్తచేతులతో తిరిగి వచ్చిన కుర్రవాణ్ణి చూసి ఆలివేణి నీరయిపోయింది. అతణ్ణి ఏమీ అడగవలసిన అవసరం ఆమెకు కలగలేదు.

ఆ కుర్రవాడు వస్తూనే మంచం మీదకు వెళ్ళి అడ్డంగా పడుకుని "మంచినీళ్ళు, మంచినీళ్ళు" అని అడిగాడు.

ఆలివేణి లేచివెళ్ళి కడవలో చూచింది. మాటవరుసకైనా ఒక్క బొట్టులేదు. గబగబా దొడ్లోకి పరుగెత్తి బావిలోకి చూచింది. ఎక్కడో పాతాళంలో వున్న కటికారాలు ఆమెను చూచి పరిహసించాయి.

మళ్ళీ అలివేణి లోపలకు వచ్చింది. ఆమెలో ఒక విచిత్రమైన ఊహ కలిగింది. 'నీళ్ళ కావళ్ళు మోసిన పేరిశాస్త్రుల్లు ఇంట్లో నీళ్ళు లేవు.'

దప్పికతో ఆర్చుకుపోయిన గొంతు, ఎండలో పరుగెత్తుకు రావడం మూలాన కలిగిన ఆయాసం వీటితో ఉచ్ఛ్వాసనిశ్వాసాల భారంతో పైకీ క్రిందికీ, పేకమేడలా ఊగిపోతున్న ఆ కుర్రవాడి ఎముకలగూటి శరీరాన్ని అలివేణి భయం భయంగా చూడసాగింది. ఆ కుర్రవాడు అట్లా ఒక గంటసేపు దాకా హైరాన పడ్డాడు. ఆ తర్వాత అతనికి విపరీతంగా, మనలోకం తెలినంతటి జ్వరం వచ్చింది. కాళ్ళు రెండూ బారజాపుకుని, వెల్లకితలా పడుకుని వున్నాడు ఆ కుర్రవాడు. కళ్ళు రెండూ అనంతమైన శూన్యంలోకి భావనా విరహితంగా చూస్తున్నాయి. అలివేణి కుర్రవాడికి దగ్గిరసా వచ్చి అతని చొక్కా మెడ సరిదిద్ది, ప్రేమగా జుట్టు సవరించింది.

క్రమంగా ఆ ప్రేమంతా జాలిగా మారిపోతున్నది. ఆమెలో భయం హెచ్చుమీరుతున్నది. ఆమె అశక్తతతో ఆ ఇల్లంతా కలయ దిరుగుతున్నది. ఆమెలో ఆలోచన లేదు. ఇంట్లోకీ, బయటకూ కాలుగాలిన పిల్లిలా పరుగులు పెడుతున్నది. నిస్సహాయంగా ఆ ఇంటి కప్పుకేసీ, గోడలకేసి, పగిలిపోయిన మట్టి కుండలకేసీ చూస్తున్నది. అకస్మాత్తుగా

ఆమెకు అనిపించింది - 'నా కిప్పుడు ఆకలి లేదు. అవును! నాలోని నరాల చివుళ్ళను ఆకలి ఉడత కొరికివేసింది. నా మనస్సులో భరించలేనంతగా ఊష్ణం కాదు, శీతలం వుంది. ఇంకా ఎందుకవుతుందీ ఆకలి?'

సూరీడు ఆహారార్థమై అప్పుడే పడమటి కొంపకు చేరుకున్నాడు. కుర్రవాడి మొగమూ, సాయంత్రమూ క్రమక్రమంగా నల్లకప్పు వేస్తున్నాయి.

ఆమెకు అకస్మాత్తుగా అనిపించింది: 'నా కుర్రవాణ్ణి బ్రతికించడానికి ఏ ధర్మాత్ముడైనా ఒక్క నయాపైసా అయినా దానం చేయడా? పోనీ, కుర్రవాడి వంటిన ఉన్న గుడ్డలూ, తన శరీరంమీది వస్త్రాలూ ఇచ్చేస్తుంది. డబ్బిచ్చే నాధుడే లేడా?"

కారణం తెలియకుండానే ఆమెలో ఆశ చిగురించింది. ఆమె మొగానికి కొంత కాంతి వచ్చింది. దానితో పిల్లవాడి ప్రక్కన వచ్చి కూచుని, అతని తల తన వళ్లోకి తీసుకుంది. ఆ కుర్రవాడికి అంతకంతకూ జ్వరం ఎక్కువవుతున్నది. అలివేణి అతనివేపే చూస్తూ అతని ప్రక్కనే కూచున్నది.

ఆమె రెండోపిల్లవాడు కూడా ఆకలిబాధ మూలంగా నిద్రరాక నానా నరకమూ అనుభవిస్తున్నాడు. అతనూ కళ్ళు పత్రికాయలు చేసుకుని, జీవిత సర్వంతో చెలగాట మాడుతున్న తన అన్నవేపు చూస్తున్నాడు.

జబ్బుపడ్డ పెద్దకుర్రవాడు మూలగడం ప్రారంభించాడు. ఒళ్ళు తెలీని ఆ జ్వరంలో అటూ ఇటూ పొర్లడం మొదలెటాడు. ఏవిటో బాధ. తెలియని నరకం.

అతని చెంపలు జ్వరంతో మండిపోతున్నాయి. మగత కమ్మినట్లయి పిచ్చిగా మాట్లాడడం మొదలు పెట్టాడు—గతస్మృతులు. కళ్ళు రెండూ ఇంటి నడికప్పుకేసి తిప్పి చూస్తున్నాడు... చూస్తున్నాడు... అర్థంలేని చూపు. దృష్టి నిల్పిన ప్రదేశం వైపే పిచ్చిచూపు—గాజు కళ్ళతో చూడడం!

రెండో కుర్రవాడు జబ్బుపడ్డ తన అన్నను మంచం మీదనుంచి లేవకుండానే చూస్తున్నాడు. ఉన్నటుండి పెద్ద వాడు అలివేణి వేపు చూశాడు. చేతులూ, కాళ్ళూ కొట్టుకుంటూ ఏదో మాటాడేస్తున్నాడు.

పెద్దవాడి పరిస్థితిని చూచిన చిన్నవాడు మెల్లగాలేచి కూచున్నాడు. తల్లికి మాత్రమే విన్పించేట్లుగా స్వప్న కంఠంతో అడిగాడు.

"అమ్మా! అన్నాయ్ చచ్చిపోతాడా?!"

వెచ్చటి వడగాలి తగిలినట్లయి అలివేణి దిమ్మెరపోయింది. భయం భయంగా కొడుకు వైపు చూసింది. ఆ

ఆ చూపుల్లో 'అట్లా అడిగావేమిటి తండ్రీ!' అన్న ప్రశ్న వుంది. తీక్ష్ణమైన తల్లి చూపు నుండి తప్పించుకోలేక, ఆ తీక్ష్ణతకు తట్టుకోనూలేక కాసేపు వూరుకున్నాడు ఆ కుర్రవాడు. ఆ తర్వాత మెల్లిగా తల్లి దగ్గరకు జరిగాడు. అక్కడ ఎవరికీవినిపించ కూడదన్నంతటి అస్ఫుటమైన స్వరంతో తల్లి చెవిలో వూదాడు: "అదిగాదే! అప్పుడు మళ్లీ అందరూ మనకు అన్నప్పళ్ళాలు పంపిస్తారు కదుటే?"